కర్ణాటకలో పాల ధరల పెంపు?

- పరోక్షంగా ప్రకటించిన సిద్ధరామయ్య
- లీటర్‌పై రూ.5 పెంచేందుకు కసరత్తు
- ఇప్పటికే పెరిగిన పెట్రో, మద్యం ధరలు

బెంగళూరు, సెప్టెంబర్ 14: కర్ణాటకలో పాల ధరను పెంచేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమవుతున్నది. లీటర్ పాలపై రూ.5 ధర పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. శుక్రవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ విషయాన్ని పరోక్షంగా ప్రకటించారు. రామనగర జిల్లా మగడిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. లీటరు పాలపై రూ.5 ధర పెంచేందుకు త్వరలో రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సహకార సంఘాలు సైతం తమకు లీటరుపై 20 పైసలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయని, దీనిపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. పాడి రైతుల డిమాండ్ మేరకు ధరలు పెంచుతున్నామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ దీని వల్ల ప్రత్యక్షంగా ప్రజలపై భారం పడనుంది.

ఏడాదిన్నరలో మూడోసారి

గత ఏడాది మే నెలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాల ధరలు పెంచడం ఇది మూడోసారి. అధికారంలోకి రాగానే గత జూలైలో లీటరుపై రూ.3 పెంచింది. తర్వాత ఈ ఏడాది జూన్‌లో మరో సారి లీటర్‌పై రూ.2 పెంచింది. ఇప్పుడు మూడోసారి లీటర్‌పై రూ.5 పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. అయితే, పాడి రైతుల కోసం ప్రభుత్వం ధరలు పెంచుతున్నామని చెప్తూ వస్తున్నది. కానీ, పాల వినియోగదారులైన ప్రజలపై భారం పడకుండా మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కర్ణాటక ప్రభుత్వ సంస్థ అయిన కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) రైతుల నుంచి పాలను సేకరిస్తుంది. నందిని బ్రాండ్‌తో ఈ పాలను ప్రజలకు విక్రయిస్తుంది. కర్ణాటకలో నందిని పాలకు భారీగా డిమాండ్ ఉంది.

మూడోసారి మద్యం ధర పెంపు!

గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చి ఎన్నికల్లో గట్టెక్కిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు వాటిని నెరవేర్చలేక నానా పాట్లు పడుతున్నది. ధరల పెంపుతో ప్రజలపైనే గ్యారెంటీల భారం మోపుతున్నది. గత జూన్‌లో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను లీటరుకు రూ.3 పెంచింది. మరోవైపు మద్యంపై ఇప్పటికే రెండుసార్లు ధరలు పెంచి, ఇప్పుడు మూడోసారి పెంపు కోసం ప్రతిపాదన సిద్ధం చేసింది. గత ఏడాది జూలైలో అదనపు ఎక్సైజ్ డ్యూటీని 10 శాతం పెంచడంతో ఒక్కో బీర్‌పై రూ.10-15 వరకు ధర పెరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి పెంచడంతో ఒక్కో బీర్‌పై రూ.15 పెరిగింది. ఇప్పుడు మూడోసారి పెంచేందుకు సిద్ధమవుతున్నది.

‘పోక్సో’ కేసు పెట్టారని సామాజిక బహిష్కరణ

- దళితులపై అగ్రవర్ణాల దుశ్చర్య
- కర్ణాటక యాద్గిర్ జిల్లాలో ఘటన

బెంగళూరు, సెప్టెంబర్ 14: పోక్సో కింద కేసు పెట్టారన్న కక్షతో ఓ గ్రామంలోని అగ్ర వర్ణాల వారు..అక్కడి దళితులందరిపైనా సామాజిక బహిష్కరణ విధించారు. కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా హునాసాగి తాలూకాలోని ఓ గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది. తమను సామాజికంగాబహిష్కరించారని గ్రామంలోని దళితులు పోలీసు ఉన్నతాధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో గ్రామంలో ఇరు వర్గాలకు చెందినవాళ్లతో పోలీసులు సమావేశమయ్యారు. ఓ బీద దళిత కుటుంబానికి చెందిన 15 ఏండ్ల బాలిక గర్భం దాల్చటంతో, బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. యువతిని మోసం చేసిన వ్యక్తి గ్రామంలో అగ్ర వర్ణానికి చెందినవాడని తేలింది. నారాయణ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై పోక్సో కింద కేసు నమోదైంది. దీనికి ప్రతీకారంగా.. గురువారం రాత్రి నుంచి దళితుల్ని సామాజికంగా బహిష్కరించినట్టు పోలీసుల విచారణలో తేలింది.

దళితుడి జాగాలో సిద్ధరామయ్య ఇల్లు

డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు ఆక్రమించారు

ఆధారాలున్నాయన్న కుమారస్వామి

బెంగళూరు, సెప్టెంబర్ 14: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత కుమారస్వామి సంచలన ఆరోపణలు చేశారు. దివ్యాంగుడైన దళితుడి స్థలాన్ని ఆక్రమించి సిద్ధరామయ్య ఇంటిని నిర్మించుకున్నారని ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సిద్ధరామయ్య డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు దివ్యాంగుడైన దళితుడికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మించారని పేర్కొన్నారు. సకమ్మ అనే పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి, తాను ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్టు చూపించి సిద్ధరామయ్య ఇంటిని నిర్మించుకున్నారని ఆరోపించారు. దీనిపై తగిన ఆధారాలు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు.

లంచం కోసం కాంట్రాక్టర్‌కు వేధింపులు!

- కులం పేరుతో దూషణ
- బీజేపీ ఎమ్మెల్యే అరెస్టు

బెంగళూరు, సెప్టెంబర్ 14: ఓ కాంట్రాక్టర్‌ను కులం పేరుతో దూషించి, చంపేస్తానని హెచ్చరించిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యేను పోలీసులు అరెస్టు చేశారు. రాజరాజేశ్వరి నగర్ ఎమ్మెల్యే మునిరత్న తనను దూషించారని, బెదిరించారని కాంట్రాక్టర్ చెల్వరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను ఎమ్మెల్యే లంచం కోసం వేధిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మీడియా ముందు ఒక ఆడియో రికార్డింగ్‌ను బయటపెట్టారు. దీంతో కులం పేరుతో దూషించినందుకు, బెదిరించినందుకు ఎమ్మెల్యేపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శనివారం ఎమ్మెల్యేను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ఈ ఆరోపణలపై ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలని మునిరత్నకు కర్ణాటక బీజేపీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

‘సున్నిత అంశాల’పైనే జాప్యం

హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌ల నియామకంపై కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి సుప్రీం కోర్టు కొలీజియం చేసిన సిఫారసులను అమలు చేయడంలో తాము ‘సున్నితమైన అంశాల’లో జాప్యం చేస్తున్నామని కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ విషయాన్ని అటార్నీ జనరల్ వెంకటరమణి చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్‌లు జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనానికి విన్నవించారు. ఈ అంశాలు పబ్లిక్ డొమైన్‌లో బహిర్గత పరచడం సంస్థలకు, పొల్గొన్న న్యాయమూర్తులకు ప్రయోజనం కలిగించదని ఆయన అన్నారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు డిసెంబర్ 14కు పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: ఆన్‌లైన్లో ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువును మరోసారి పొడిగించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు ఉచితంగా చేసుకోవడానికి గడువు ఈ నెల 14న ముగియడంతో పౌరులకు ఈ సౌకర్యాన్ని మరికొంత కాలం కొనసాగించడం కోసం ఈ ఏడాది డిసెంబర్ 14 వరకు దీనిని పొడిగిస్తున్నట్టు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) శనివారం వెల్లడించింది. ఆధార్ కార్డులు తీసుకుని గత పదేండ్లు దాటి అప్పటి నుంచి చిరునామా, ఇతర వివరాలు అప్‌డేట్ చేసుకోని పౌరులు వాటిని ఉచితంగా అప్‌డేట్ ‘మై ఆధార్ పోర్టల్’లో చేసుకోవాలని యూఐడీఏఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

నకిలీ టికెట్ల పని పట్టే యాప్

అభివృద్ధి చేసిన రైల్వే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: రైల్వేలో నకిలీ, ట్యాంపర్డ్ అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్లను కనిపెట్టడానికి ఒక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ)లు వీటి సహాయంతో నకిలీ టిక్కెట్లను ఇట్టే పట్టేస్తారు. ఈ టీటీఈ ఆండ్రాయిడ్ యాప్ సహాయంతో అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్ విధానంలో జారీ చేసినవి సక్రమమైనవా, అక్రమమైనవా అని పరిశీలించవచ్చు. దీని కోసం టీటీఈ లందరికీ హెచ్ఎంటీ మిషన్లను అందజేశారు. టిక్కెట్‌పై ఉన్న యూటీఎస్ నెంబర్ నమోదు చేయడం ద్వారా అది అసలుదా, నకిలీదా అన్నది వీరు కనిపెట్టేస్తారు. అలాగే ఈ యాప్ ద్వారా టికెట్‌పై ముద్రించి ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

వంతెన కూలడాన్ని ముందే చెప్తుంది

పరికరాన్ని అభివృద్ధి చేసిన ఐఐటీ మండీ ప్రొఫెసర్

న్యూఢిల్లీ: బలహీనంగా, కూలిపోయే స్థితిలో ఉన్న వంతెనల గురించి ముందుగానే హెచ్చరించే డిజిటల్ పరికరాన్ని ఐఐటీ మండీ ప్రొఫెసర్ డాక్టర్ శుభమయ్ సేన్ అభివృద్ధి చేశారు. పరిశోధకుడు ఈశ్వర్ కుంచుమ్‌తో కలిసి దీనిని రూపొందించారు. వంతెనలో అత్యంత బలహీనంగా ఉన్న చోట దీనిని అమర్చితే, దీని లోని అల్గోరిథం ఎప్పటికప్పుడు వంతెన భద్రత, పటిష్టత ఏ స్థితిలో ఉందో గుర్తించి సమాచారాన్ని అందజేస్తుంది.ఈ డిజిటల్ మోడల్ ద్వారా వంతెన పరిస్థితిని కచ్చితంగా తెలుసుకోవచ్చు. వరదలు, భూకంపాలు వంటి విపత్తుల సమయంలో కూలిపోయే అవకాశం ఉన్న వంతెనల సమాచారాన్ని ఈ పరికరం అప్పటికప్పుడు వివిధ శాఖలకు పంపిస్తుంది.

ఇజ్రాయెల్‌పై లెబనాన్ రాకెట్ల వర్షం

సమర్థంగా తిప్పికొట్టామన్న సైన్యం

గాజా: ఇజ్రాయెల్‌పై లెబనాన్ రాకెట్ల వర్షం కురిపించింది. సఫేద్, దాని పరిసర ప్రాంతాల్లో శనివారం 55 రాకెట్లతో విరుచుకుపడింది. అయితే ఈ దాడిలో ఎవరూ గాయపడలేదని ఇజ్రాయెల్ మిలటరీ తెలిపింది. మొదటి విడతగా 20 రాకెట్లు, మరుక్షణంలోనే మరో 35 రాకెట్లతో దాడి జరిగిందని, అయితే వాటిలో చాలా వాటిని సమర్థంగా అడ్డుకొన్నారని, మిగిలినవి మైదాన ప్రాంతాల్లో పడ్డాయని ఆర్మీ అధికారులు చెప్పినట్టు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ తెలిపింది. దాడికి ముందు జాగ్రత్తగా ఉండాలంటూ ఇజ్రాయెల్ తన పౌరులకు అప్రమత్తం చేసింది. ఈ దాడి జరిగిన కొద్ది సమయం తర్వాత ఇజ్రాయెల్ మిలటరీ జెట్లు దక్షిణ లెబనాన్‌పై రాకెట్ లాంఛర్లను ప్రయోగించాయి. కాగా, గురువారం లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వాయుసేన దాడిలో ముగ్గురు మరణించారు.

మరోసారి రష్యా డ్రోన్ల దాడి

మాస్కో: రష్యా మరోసారి భారీస్థాయిలో డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడికి ప్రతిగా ఉక్రెయిన్ కూడా దీటుగా బదులిచ్చింది. తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో దాదాపు 72-76 డ్రోన్లను కూల్చివేసింది. ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. తమ దేశ పౌరులను లక్ష్యంగా చేసుకొని రష్యా దాడులకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత మంగళవారం కూడా రష్యా దాదాపు 140 డ్రోన్లతో దాడి చేసింది.

తాజ్‌మహల్ ప్రధాన గుమ్మటం లీక్

భారీ వర్షానికి నీట మునిగిన తోట

ఆగ్రా, సెప్టెంబర్ 14: ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన ఆగ్రాలోని తాజ్‌మహల్ ప్రధాన గుమ్మటం వద్ద నీరు లీకవుతున్నది. గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలకు ఇది సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వర్షాలకు తాజ్‌మహల్ ప్రాంగణంలోని తోట కూడా నీట మునిగింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరలైంది. దీనిపై పురావస్తు శాఖ(ఏఎస్ఐ) సూపరింటెండెంట్ చీఫ్ రాజ్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ వర్షాల కారణంగా సీపేజ్ వ్యవస్థలో లోపం ఏర్పడి ప్రధాన డోమ్‌లో లీకేజీ సంభవించిందని చెప్పారు. డ్రోన్ కెమెరాతో ప్రధాన గుమ్మటాన్ని క్షుణ్ణంగా పరిశీలించామని, అయితే దానికి ఎలాంటి నష్టం జరగలేదని స్పష్టం చేశారు. సరైన నీటి పారుదల సౌకర్యం లేకే తోట మునిగిందని స్థానికులు తెలిపారు. కాగా, ఎడతెరపి లేని వర్షం కారణంగా ఆగ్రా నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఆగ్రా హైవేపై సైతం వర్షం నీరు పెద్దయెత్తున నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు తెలిపారు.

బారాముల్లా ఎన్‌కౌంటర్‌లో తుపాకుల తూటాలతో ధ్వంసమైన భవనం

ప్రధాని పర్యటన వేళ ఎన్‌కౌంటర్లు

జమ్ము కశ్మీర్‌లో ఐదుగురు తీవ్రవాదులు మృతి

శ్రీనగర్, సెప్టెంబర్ 14: ప్రధాని మోదీ పర్యటన వేళ జమ్ము కశ్మీర్‌లో వరుస ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నాయి. బారాముల్లా, కిష్ట్వార్ జిల్లాల్లో మూడు చోట్ల జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఇద్దరు జవాన్లు వీర మరణం పొందారు. నాలుగు రోజుల్లో ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు తీవ్ర కలకలం రేపాయి. శుక్రవారం బారాముల్లాలో భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీస్ సంయుక్త సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. శనివారం ఉదయం పట్టాన్ ప్రాంతం చాక్ టాపెర్ ప్రాంతంలో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. శుక్రవారం కథువాలో భారత సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు. ఘటనా స్థలంలో పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండును స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు ‘ఎక్స్’లో తెలిపారు. ఎన్నికల ప్రచార నిమిత్తం దోడా జిల్లాలో మెగా ర్యాలీలో ప్రధాని మోదీ పాల్గొనబోతున్నారు. భారత ప్రధాని దోడా జిల్లాలో పర్యటించటం 42 ఏండ్లలో ఇదే తొలిసారి.

చోరీ చేశాడని నగ్నంగా నృత్యం చేయించారు

రాజస్థాన్‌లో దళిత బాలుడిపై దాష్టీకం

జైపూర్, సెప్టెంబర్ 14: రాజస్థాన్‌లో కొంతమంది 12 ఏండ్ల ఓ దళిత బాలుడిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. దొంగతనం చేశాడన్న నెపం మోపుతూ..ఆ బాలుడి బట్టలు ఊడదీసి, నగ్నంగా నడిరోడ్డుపై నృత్యం చేయించారు. శుక్రవారం రాత్రి కోటా నగరంలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనకు సంబంధించి వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. జీపడీ సర్కిల్ వద్ద జరిగిన ఓ హాస్య కార్యక్రమానికి తన కుమారుడు హాజరయ్యాడని, మ్యూజిక్ వైర్లు దొంగలించాడన్న నెపంతో రాత్రి 1 గంట సమయంలో తన కుమారుడిపై కొంతమంది దాడి చేశారని బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

అక్కగా చెప్తున్నా.. నిరసన వీడండి

సంక్షోభ పరిష్కారానికి మమత చివరి యత్నం

వీడియోగ్రాఫర్‌ను అనుమతించ లేదని చర్చల నుంచి వెనుదిరిగిన జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా: ఆర్‌జీ కర్ దవాఖాన ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం అనంతరం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, జూనియర్ వైద్యుల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన కొనసాగుతున్నది. దీనికి తెర దించేందుకు చివరి ప్రయత్నం చేస్తున్నానంటూ ముఖ్యమంత్రి మమత బెనర్జీ శనివారం జూనియర్ వైద్యుల ధర్నా స్థలం వద్దకు ఆకస్మికంగా వెళ్లారు. నిరసనలో పాల్గొన్నవారిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, వర్షాలు పడుతూ ఉంటే, డాక్టర్లు రోడ్డు మీద ధర్నా చేస్తుండటం వల్ల తాను 34 రోజుల నుంచి నిద్రలేని రాత్రులు గడుపుతున్నానని చెప్పారు. తాను ఓ అక్కగా వచ్చానని, ముఖ్యమంత్రిగా కాదని, అందువల్ల నిరసన తెలుపుతున్నవారి మీద ఎలాంటి చర్యలు తీసుకోనని హామీ ఇచ్చారు. దీంతో సాయంత్రం మమత నివాసానికి జూనియర్ డాక్టర్లు వెళ్లారు. అయితే ఈ సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలని వారు పట్టుబట్టారు. ‘ఇంట్లో 40 మందిని కూర్చోబెట్టగలమా? మొత్తం సమావేశాన్ని రికార్డ్ చేస్తున్నాం. దానిని మీకూ ఇస్తాం’ అని చెప్పారు. అయితే తమ వీడియోగ్రాఫర్‌ను సమావేశానికి అనుమతించకపోవడం వల్ల చర్చలు జరగలేదని జూనియర్ డాక్టర్లు తెలిపారు.

డాక్టర్లపై దాడికి కుట్ర?

ధర్నా చేస్తున్న డాక్టర్లపై దాడికి కుట్ర జరిగిందని టీఎంసీ నేత కుణాల్ ఘోష్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో ఓ ఆడియో క్లిప్‌ను వినిపించారు. వైద్యులు సీఎంతో సమావేశమయ్యేందుకు వెళ్లినపుడు వారిపై దాడి చేయాలని ఆ ఆడియో క్లిప్‌లో ఉంది. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తొలుత కేసును విచారించిన ఎస్‌హెచ్‌వోను సీబీఐ శనివారం అరెస్టు చేసింది.

కోల్‌కతాలో బాంబు పేలుడు

శనివారం మధ్యాహ్నం సెంట్రల్ కోల్‌కతాలో ఎస్ఎన్ బెనర్జీ, బ్లోల్‌మ్యాన్ కూడలిలో బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ప్లాస్టిక్ వస్తువుల్ని సేకరించే 58 ఏండ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

ఏచూరికి తుది వీడ్కోలు

వివిధ పార్టీ నేతల నివాళులు

న్యూఢిల్లీ: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి వివిధ పార్టీల అగ్ర నేతలు శనివారం నివాళులర్పించారు. లాల్ సలామ్ నినాదాల మధ్య ఆయన పార్థివ దేహాన్ని ఆయన నివాసం నుంచి పార్టీ ప్రధాన కార్యాలయం ఏకేజీ భవన్‌కు తీసుకొచ్చారు. సీపీఎం పాలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్, బృందా కారత్, పినరయి విజయన్, ఎంఏ బేబీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఎన్‌సీపీ (ఎస్‌పీ) చీఫ్ శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే నేతలు ఉదయనిధి స్టాలిన్, టీఆర్ బాలు; సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా తదితరులు ఆయనకు నివాళులు అర్పించారు. ఆనంతరం ఆయన పార్థివ దేహాన్ని ఎయిమ్స్‌కు అప్పగించారు.

మృతదేహాన్ని విరాళంగా ఇవ్వడం ఎలా?

అవయవాలను దానం చేయడానికి రెండు పద్ధతులు ఉన్నాయి. వ్యక్తి తాను జీవించి ఉన్న కాలంలో తన అవయవాలను విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకోవచ్చు. ఓ ఫారాన్ని నింపి, తాను సంతకం చేసి, ఇద్దరు సాక్షుల చేత సంతకాలు చేయించాలి. సాక్షుల్లో ఒకరు సమీప బంధువు అయి ఉండాలి. మరణానంతరం కుటుంబ సభ్యులు మరణించిన వ్యక్తి కోరిక మేరకు విరాళంగా ఇవ్వవలసి ఉంటుంది. వ్యక్తి జీవించి ఉన్న కాలంలో ఇటువంటి నిర్ణయం తీసుకోకపోతే, మరణానంతరం కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను విరాళంగా ఇవ్వవచ్చు. మరణించిన తర్వాత నిర్దిష్ట సమయంలోగా అవయవాలను తొలగించి, దానం చేయాలి. మెదడు పని చేయడం ఆగిపోయిన సందర్భాల్లో మాత్రమే గుండె, కాలేయం, మూత్రపిండాలు, పేగులు, ఊపిరితిత్తులను దానం చేయవచ్చు. సహజంగా మరణించినపుడు కార్నియా, గుండె నాళాలు, చర్మం, ఎముకలను దానం చేయవచ్చు. గుండెను 4 గంటల్లోగా, కాలేయాన్ని 24 గంటల్లోగా, మూత్రపిండాలను 72 గంటల్లోగా, కార్నియాస్‌ను 14 రోజుల్లోగా, ఊపిరితిత్తులను 4-6 గంటల్లోగా మార్చవలసి ఉంటుంది.

ఏచూరి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న శరద్ పవార్

దానంగా ఇచ్చే మృతదేహాలను ఏం చేస్తారు?

దవాఖానలకు దానంగా ఇచ్చే మృతదేహాలను ఎలా వినియోగిస్తారు? వాటిని తిరిగి కుటుంబ సభ్యులకు ఇస్తారా? అనే అంశాలపై చాలామందికి సందేహాలు ఉన్నాయి. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం, ఇలాంటి మృతదేహాన్ని ఫార్మాలిన్‌తో పరిరక్షిస్తారు. దీనివల్ల దానిపై బ్యాక్టీరియా లేదా క్రిములు పెరగవు. ఫలితంగా అది క్షీణించదు. కర్ర మాదిరిగా తయారవుతుంది. ఆ తర్వాత దానిని పరిశోధనల కోసం ఉపయోగిస్తారు. శరీరంలోని వివిధ భాగాల గురించి అధ్యయనం చేసే ప్రథమ సంవత్సరం వైద్య విద్యార్థులు ఇలాంటి మృత దేహాలను ఉపయోగించుకుంటారు. పదే పదే గాలి తగిలేలా ఉంచడం వల్ల కొన్ని రోజులకు ఇలాంటి మృతదేహాలు ఉపయోగించలేని పరిస్థితికి వస్తాయి. అప్పుడు వాటిని తిరిగి కుటుంబ సభ్యులకు ఇస్తారు. అంటే అప్పటికి మృతదేహం పూర్తిగా చెడిపోదు. శరీర నిర్మాణంలో మార్పులు వస్తాయి, ముఖాన్ని గుర్తు పట్టడం కష్టం కావచ్చు.

ఒప్పందం లాగా హిందూ పెండ్లిని రద్దు చేయలేం

అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్, సెప్టెంబర్ 14: ఒక ఒప్పందం మాదిరిగా హిందూ వివాహాన్ని రద్దు చేయలేమని, హిందూ వివాహ బంధం నుంచి తొలగిపోవడం, రద్దు చేయడం కుదరదని అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హిందూ వివాహ చట్టం ప్రకారం కొన్ని పరిమిత పరిస్థితులు, సందర్భాల్లో.. అది కూడా పార్టీల నేతృత్వంలోని బలమైన సాక్ష్యాల వల్ల మాత్రమే మత కర్మ ఆధారంగా జరిగిన హిందూ వివాహం రద్దు చేయవచ్చునని పేర్కొంది. ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్‌లు సౌమిత్ర దయాల్ సింగ్, డొనాది రమేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. అప్పీల్‌దారు ఒక సారి వివాహ రద్దుకు అనుమతి తెలిపి, తర్వాత దానిని రద్దు చేసుకున్నాక ముందుగా ఆమోదించిన సమ్మతికి అప్పీల్‌దారు కట్టుబడి ఉండాలని దిగువ కోర్టు బలవంతం చేయడం తగదని హైకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. 2011లో బులంద్‌షహర్ అడిషనల్ జిల్లా కోర్టు తమ వివాహం రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది.

వందేండ్ల కోసం నిర్మాణం.. ఐదేండ్లకే కూల్చివేతకు సిద్ధం

ఇది గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్మించిన హత్కేశ్వర్ ఫ్లైఓవర్. ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం రూ.44 కోట్లు వెచ్చించి దీనిని నిర్మించింది. 2017లో అట్టహాసంగా ప్రారంభించింది. వందేండ్ల వరకు ఫ్లైఓవర్ చెక్కు చెదరదని గొప్పగా ప్రకటించింది. తీరా చూస్తే ఐదేండ్లకే 2022లో ఫ్లైఓవర్ బీటలు వారింది. రాకపోకలు సైతం నిలిచిపోయాయి. నాణ్యత లేని నిర్మాణంతో పిల్లర్లలో బలం తగ్గింది. మరమ్మత్తులు చేసినా ఫలితం లేదని, కూల్చడం తప్ప మరో మార్గం లేదని నిపుణులు తేల్చిచెప్పారు. దీంతో సర్కారు ఇప్పుడు ఫ్లైఓవర్‌ను కూల్చి, మళ్లీ కట్టాలని నిర్ణయించింది. ఇందుకు రూ.52 కోట్లు వృథా చేయనుంది.



సౌండ్ ప్రూఫ్ రహదారి.. రెండేండ్లకే బీటలు బారి

ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడిన ఈ ఎలివేటెడ్ రోడ్డు మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో ఉంది. 44వ జాతీయ రహదారిపై రూ.960 కోట్లతో కేంద్రం నిర్మించింది. ఇక్కడి పెంచ్ టైగర్ రిజర్వ్‌లో కింది నుంచి వన్యప్రాణులు వెళ్లేలా నిర్మాణం చేపట్టింది. వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా సౌండ్ బ్యారియర్లు, హెడ్‌లైట్ రెడ్యూసర్లు ఏర్పాటు చేసింది. రెండేండ్ల క్రితం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ రోడ్డును ప్రారంభించారు. దీనిని ఆసియాలోనే అతిపెద్ద సౌండ్, లైట్ ప్రూఫ్ రోడ్డుగా కేంద్రంగా ఘనంగా ప్రకటించింది. అయితే, నాణ్యతా లోపం కారణంగా రెండేండ్లకే రహదారిపై ఓ వంతెన బీటలు వారింది.

భయంకర బాహుబలి గుండె పోటుతో మృతి

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యంత భారీ బాడీ బిల్డర్‌గా గుర్తింపు పొందిన ఇల్లియా ‘గోలెమ్’ యెఫించిక్ (36) గుండెపోటుతో మరణించారు. ఆయనను ‘ది మ్యుటెంట్’ అని ముద్దుగా పిలుస్తారు. 6 అడుగుల ఎత్తు, 340 పౌండ్ల బరువు గల ఆయన ప్రపంచంలో అత్యంత భయంకరమైన బాడీ బిల్డర్(బాహుబలుడి)గా పేరు సంపాదించినప్పటికీ ఎన్నడూ ఏ పోటీల్లోనూ పాల్గొనలేదు. ఆయన సతీమణి అన్నా మాట్లాడుతూ.. ఈ నెల 6న ఆయన గుండె చాలా వేగంగా కొట్టుకుందని,